క్లుప్తంగా

నేడు మంచినీళ్ల పండుగ

ఆమనగల్లు: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 18న కల్వకుర్తి పట్టణంలోని మిషన్ భగీరథ కేంద్రంలో తెలంగాణ మంచినీళ్ల పండుగ నిర్వహిస్తున్నట్లు మిషన్ భగీరథ శాఖ ఆమనగల్లు ఏఈ శరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని ఏఈ కోరారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కల్యాణ్ నాయక్ తదితరులు

తుర్కయంజాల్: దశల వారీగా వార్డు అభివృద్ధి పనులు చేపడుతున్నామని టీఆర్ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కల్యాణ్‌నాయక్ తెలిపారు. కమ్మగూడలో శనివారం ఆయన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. దీంతో సుందరయ్య నగర్, లక్ష్మీనగర్, శ్రీశ్రీ నగర్, ఇంజాపూర్‌లోని ఆపిల్ ఎవెన్యూ, శ్రీరంగాపురం, సాయినధ్ కాలనీల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తీరనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పున్న శ్రీనివాస్ నేత తదితరులు పాల్గొన్నారు.

విద్యాదినోత్సవాన్ని విజయవంతం చేయండి

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్



మంత్రి ఇచ్చిన లేఖలను చూపుతున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించనున్న విద్యాదినోత్సవాన్ని విజయవంతం చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలలో మంత్రి సబితారెడ్డి ఇచ్చిన ఆహ్వాన పత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు పంపించారు.

ఉన్నత చదువులకు 'ఉప్పల' చేయూత



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న వెంకటేశ్

కడ్తాల్: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఉప్పల ఛారిటబుల్ ట్రస్ట్ చేయూతనిస్తోందని చైర్మన్ వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన హజీరాబేగం కూతురు అమ్రిన్ సుల్తానా ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారాయి. విద్యార్థిని మేనమామ కలీం ట్రస్ట్ చైర్మన్‌ను కలిసి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన వెంకటేశ్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి రూ.15 వేల ఫీజు చెల్లించారు.ఈ సంద్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, నాయకులు ఆంజనేయులుగౌడ్, సాయి, తిరుపతినాయక్, శంకర్, గోపాల్, వినోద్, శ్రీను తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు నిరంతర ప్రోత్సాహం

ఎంపీటీసీ సభ్యురాలు శారద



స్పోర్ట్స్ డ్రెస్‌లు ధరించిన మల్కీజ్‌గూడ క్రీడాకారులు

యాచారం: క్రీడాకారులకు నిరంతర ప్రోత్సాహం ఉంటుందని మల్కీజ్‌గూడ ఎంపీటీసీ సభ్యురాలు వరికుప్పల శారద అన్నారు. శనివారం ఆమె గ్రామంలోని క్రీడాకారులకు రూ.14వేల విలువ చేసే క్రీడా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్, అబ్బయ్య, అనంత్‌రెడ్డి, శేఖర్, ప్రవీణ్‌రెడ్డి, రామకష్ణ, రాజశేఖర్, శంకర్, విక్రమ్, మహేశ్, మధు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

ఆమనగల్లు: మండల పరిధిలోని మంగళపల్లి పరిధిలోని చెన్న కేశవ కాలనీకి చెందిన బాలయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నర్సింహారెడ్డి శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎర్రవోలు శ్రీనివాస్ తదితరులున్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేశారు.

కులవృత్తులకు అధిక ప్రాధాన్యం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- రాందాస్‌పల్లిలో రెండో విడత గొర్రెల పంపిణీ



ఇబ్రహీంపట్నం రూరల్: రాందాస్‌పల్లిలో రెండో విడత గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం కుల వృత్తులకు ప్రాధాన్యతనిస్తూ వారి ఆర్థిక ప్రగతికి తోడ్పాటునిస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లిలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో 16 యూనిట్లను గొల్లకురుమలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుల సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గొల్లకురుమలకు గొర్రెల పంపిణీ, ముదిరాజ్‌లకు పనిముట్లు, చేపలు పట్టడానికి పరికరాలు అందజేసిందన్నారు. దళితబంధుతో దళితుల ఆర్థికాభివృద్ధి బాటలు వేస్తోందన్నారు. చింతపల్లిగూడ నుంచి బ్రాహ్మణపల్లి రోడ్డు అభివృద్ధికి రూ.60లక్షలు అంచనా వేసి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. కోహెడ రోడ్డుకు నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఆర్డీఓ వెంకటాచారి, కౌన్సిలర్ సంధ్య, ఆదిబట్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు జంగయ్య, గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షుడు శ్రీశైలం, వీరారెడ్డి, రాజు, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి

హయత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని.. తమ పరిధిలో పరిష్కరించలేని సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన అబ్దుల్లాపూర్ మెట్టు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజక వర్గంలోని రోడ్లను చాలా వరకు డబుల్ రోడ్లుగా మార్చామని, త్వరలోనే లష్కర్ గూడ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. మీ సేవల్లో ఇష్టానుసారంగా బిల్లులు వసూలు చేస్తున్నారని వాటిని అరికట్టాలని పలువురు సభ్యులు కోరారు. మీసేవా సెంటర్లపై దాడులు నిర్వహించి నిర్వహకులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. మండలంలో ఎన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉన్నయో నివేదిక ఇవ్వాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

ఆర్టీసీ సిబ్బందిపై ఎంపీపీ మండిపాటు

ఆర్టీసీ అధికారులు నామమాత్రంగా సమావేశాలకు హాజరవుతున్నారని.. కింది స్థాయి అధికారులు సమావేశాలకు రావడంతో సమస్యలు పరిష్కారమవ్వడం లేదని ఎంపీపీ మండిపడ్డారు. కోవిడ్ తర్వాత గ్రామాల్లో బస్సు సర్వీసులను పునరుద్ధరించలేదని, సమస్యలను ఎన్నిసార్లు ప్రస్తావించినా ప్రయోజనం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ రేఖామహేందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దేవదాస్ గౌడ్, వైస్ ఎంపీపీ కొలను శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటాచారి, తహసీల్దార్ అనితారెడ్డి, ఎంపీడీఓ మమతాబాయి తదితరులు పాల్గొన్నారు.

పటేల్ చెరువు తండాలో 'గిరిజనోత్సవం'

మంచాల: ఏళ్ల తరబడిగా వెనుక బాటుకు గురైన గిరిజన తండాలను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం పటేల్ చెరువు తండాలో గిరిజనోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి గిరిజనులు ఘన స్వాగతం పలికారు. పటేల్ చెరువు తండాలో రూ.20లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తండాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. పటేల్‌చెరువుతండాలో అభివృద్ధి పనులకు మరో రూ.10లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటాచారి, ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, తహసీల్దార్ అనిత, ఎంపీడీఓ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్ , ప్రధాన కార్యదర్శి బహదూర్, పటేల్ చెరువు తండా సర్పంచ్ రాజు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు , నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటుకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: పట్టణంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ హరీశ్‌ను కోరారు. పట్టణంలో నిర్వహించిన గిరిజన భవన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరీశ్‌ను మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ దివ్య, రాధమ్మ, సోని, నాయకులు శ్రీకాంత్‌సింగ్, బైకని శ్రీశైలంయాదవ్‌లు కలిసి ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు పట్టణంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఆధార్ సెంటర్ కోసం 20 నుంచి 30 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని వారు వివరించారు.

మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తట్టి అన్నారంలోని జంగారెడ్డి కుంటలో ఓ ప్రజా ప్రతినిధి మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నారని మర్ల రాంరెడ్డి అనే వ్యక్తి శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గతంలోనే సంబంధిత డీఈ ఫిర్యాదు చేయగా ఆయన పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధికి అడ్డంకిగా ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తుర్కయంజాల్ మున్సిపల్ అభివృద్ధికి అడ్డంకిగా మారారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ.. తుర్కయంజాల్ మున్సిపాలిటీకి ప్రజల చేత ఎన్నుకోబడిన కాంగ్రెస్ పాలకవర్గాన్ని పక్కకు పెట్టి తన పదవిని అడ్డుగా పెట్టుకుని అధికారులను చేతుల్లో పెట్టుకుని పాలన కొనసాగిస్తున్నాడన్నారు. కౌన్సిలర్ పేర్లు లేకుండా పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించడం సరికాదన్నారు. మున్సిపల్ పరిధిలో విలువైన ప్రభుత్వ భూములను హెచ్ఎండీఏ వేలం వేసి కోట్ల రూపాయలను ఆర్జించిందన్నారు. అనువైన ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అమ్ముకుని, నాలాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని విమర్శించారు. భూముల అమ్మకం. ఇంటి నిర్మాణ అనుమతుల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వస్తున్న తిరిగి అది మున్సిపాలిటికి చేరడం లేదన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఎందుకు ఆ నిధులను తీసుకురాలేకపోతున్నాడన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చకు రావాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరాడు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు, కౌన్సిలర్ సునీల్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, కౌన్సిలర్లు మంగమ్మ, బాలరాజు, ధన్‌రాజ్, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, దర్శన్, ఎండీ గౌస్‌పాషా, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా అంశంపై సమాధానం దాటవేత

మున్సిపాలిటీ అంశంపైన మీరు మాట్లాడుతున్నప్పుడు మీ వెంట చైర్‌పర్సన్, మెజార్టీ కౌన్సిలర్లు ఎందుకు లేరని మీడియా ప్రశ్నించగా ఆయన సమాధానం దాటవేశారు. చైర్‌పర్సన్ పదవి మార్పు విషయంలో మల్‌రెడ్డి అనురాధ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి నేటికి ఎందుకు ఆ విషయాన్ని ప్రస్తావించడం లేదని అడగ్గా ఆ విషయం చైర్ ప్రర్సన్‌నే అడగాలని బదులిచ్చారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న నర్సింహారెడ్డి

తుర్కయంజాల్: బీజేపీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మాదు శ్రీకాంత్‌రెడ్డిపై దాడికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన గాయపడిన శ్రీకాంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. స్థానికంగా ఉండే కొందరు నాయకులు భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలపై శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నందునే దాడికి పాల్పడ్డారన్నారు. స్థానిక సమస్యలపై పోరాటం చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి స్థానికేతరుడనే కారణంతోనే తలపై ఇటుకతో దాడి చేశారని ఆరోపించారు. ఆయన వెంట వనపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోసుపల్లి ప్రతాప్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేష్, నియోజకవర్గ కన్వీనర్ యాదగిరిరెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు తూళ్ల నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో జబ్బులు దూరం

పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి

తలకొండపల్లి: ధ్యానంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. శరీరంలోని వ్యాధులను తొలగించడమే కాకుండా భవిష్యత్‌లో వ్యాధులు రాకుండా నివారిస్తుందన్నారు. మండల పరిధిలోని వీరన్నపల్లిలో శనివారం పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ.. నిత్యం ధ్యానంతో తలనొప్పి నుంచి క్యాన్సర్ వరకు రోగాలను తగ్గించుకోవచ్చన్నారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచి ధ్యానం అలవాటు చేస్తే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత వస్తుందన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్లు శైలజ, మధుసూదన్‌రెడ్డి, లలిత, పద్మ, జంగయ్య, ఆంజనేయులు, హిత, తేజస్విని, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

మంచాల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచాల మండల స్థాయిలో ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. చిత్ర లేఖనం పోటీల్లో చెన్నారెడ్డిగూడ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఆర్.అశ్విని మొదటి బహుమతి, అదే పాఠశాలకు చెందిన అమూల్య ద్వితీయ బహుమతి సాధించారు. వ్యాస రచన పోటీల్లో ఆరుట్ల మోడల్ స్కూల్‌కు చెందిన ఎం.హరినిత్య మొదటి బహుమతి, చెన్నారెడ్డి గూడ జెడ్పీహెచ్ఎస్‌కు కె.అమూల్య ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి విమల, న్యాయ నిర్ణేతలుగా ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, గోపాల్, అజ్మత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి ఎమ్మెల్యే నిధులు

- గిరిజనోత్సవంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- గడ్డమీది తండాలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

తలకొండపల్లి: గిరిజనుల సంక్షేమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని గడ్డమీది తండాలో గిరిజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులు నృత్యాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. అనంతరం పంచాయతీ భవన నిర్మాణానికి ఉచితంగా స్థలాన్ని ఇచ్చిన స్థలదాత గ్రామ పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు కొర్ర కృష్ణను ఎమ్మెల్యే సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.25లక్షల ప్రభుత్వ నిధులతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. తండాల అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. గరిమతండాలో మిషన్ భగీరథ కింద వాటర్ ట్యాంక్ నిర్మాణం, తండా నుంచి 1 కిమీ వరకు బీటీరోడ్డు మంజూరు చేయిస్తానని చెప్పారు. గడ్డమీది తండా నుంచి వెంకట్రావ్‌పేట్ వరకు 3 కిమీ దూరం మేరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి రూ.1.80కోట్లు మంజూరు చేశామన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల కోసం బంజార భవనాలను నిర్మిస్తుందన్నారు. గిరిజనులందరు రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు తెలిపి సీఎం కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ ఈశ్వర్, ఉప సర్పంచ్ శేషానాయక్, మాజీ సర్పంచ్ దశరథ్‌నాయక్, ఎంపీటీసీ సభ్యురాలు సరిత, గణేష్‌గుప్తా, ఎంపీడీఓ శ్రీకాంత్, తహసీల్దార్ కృష్ణ, డీఈ తిరుపతిరెడ్డి, ఏఈ విద్యాసాగర్, ఎంపీఓ రఘు, రమేశ్, విజయ్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, వెంకటయ్య, వార్డు సభ్యులు, గిరిజన మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలకు భూమి పూజలు

కడ్తాల్: మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్‌తండా పంచాయతీలో ఎస్టీ కాంపోనెట్ నిధులు రూ.20 లక్షలతో నూతన పంచాయతీ భవన నిర్మాణ పనులకు శనివారం సర్పంచ్ సేవ్యానాయక్, ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాలన సులభతరమైందన్నారు. గిరిజనుల సంక్షేమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గడ్డమీది తండా పంచాయతీలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, సర్పంచ్ పాండునాయక్‌తో కలిసి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, ఉప సర్పంచ్‌లు రమణ, శ్రీనునాయక్, ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌నాయక్, నాయకులు బీచ్యానాయక్, నేజ్యానాయక్,గణేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్: సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన బాధితుడికి సీఎంఆర్ఎఫ్ నుంచి చెక్కు మంజూరైంది. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే బాధితుడికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లచ్చిరామ్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, నాయకులు కృష్ణ తదితరులు ఉన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



గిరిజనుల నృత్యాలు

పరామర్శ

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకుడు బోళ్ల సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని డీఆర్డీఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ శనివారం ఆయన్ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన్ను పరామర్శించిన వారిలో నాయకులు రాజు, మహేశ్, బాలయ్య, రమేశ్, యాదగిరి, అశోక్ తదితరులు ఉన్నారు.

అడ్మిషన్ ఫీజు పేరిట దోపిడీ



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నేతలు

ఇబ్రహీంపట్నం: అడ్మిషన్ ఫీజుల పేరిట ప్రైవేటు పాఠశాలలు దోపిడీకి పాల్పడుతున్నాయని ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రైవేటు పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నడిపిస్తున్నా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. పాఠశాలకు 7వ తరగతి వరకే అనుమతులున్నా 8,9,10 తరగతుల వరకు అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ ధర్నాలో ఏబీవీపీ నాయకులు కందాడి శ్రీరామ్, ఎం.సాయిచరణ్, వంగ సంజీవరెడ్డి, శివకృష్ణ, జగదీశ్, సందీప్, మహేందర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'సర్వ్' సేవలు అభినందనీయం

సర్పంచ్ సుగుణ

కడ్తాల్: దివ్యాంగుల పునరావాసానికి, వారి సంక్షేమాభివృద్ధికి సర్వ్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ సుగుణ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లి పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్వ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు దివ్యాంగులకు ఉచిత బస్సు పాసుల పంపిణీ చేశారు. గ్రామంలోని 30 మంది దివ్యాంగులకు ఉచిత బస్సు పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు అవసరమైన విద్యా, వైద్య, ఆర్థిక, సామాజిక అవసరాలను గుర్తించి వారి సంక్షేమం కోసం సర్వ్ సంస్థ కృషి చేయడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు మీనాక్షి, ఎంపీటీసీ ఉమావతి, దివ్యాంగుల సంఘం గ్రామ అధ్యక్షుడు శంకరయ్య, వార్డు సభ్యులు చంద్రయ్య, శాంతయ్య, శ్రీనివాస్, శివ, మల్లయ్య, జైపాల్, సంస్థ సిబ్బంది ధనలక్ష్మి, సార, వసంత, శ్రీనివాస్, ఆర్టీసీ బస్సు పాసుల ఇన్‌చార్జి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: జూలై 2న నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, ఇన్‌చార్జి కృష్ణనాయక్, నియోజకవర్గ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 2న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, నాయకులు భానుకిరణ్, రాజేశ్, లక్ష్మయ్య, శేఖర్, నేజ్యా, అజ్గర్‌అలీ, ఇమ్రాన్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కళ్లు దానం



కొత్తపల్లి గ్రామస్తులకు ధృవీకరణ పత్రం అందజేస్తున్న ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు

యాచారం: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బరిగెల జంగయ్య, మీనమ్మల కుమారుడు రవి(28) నగరంలో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఈనెల 15న విషం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన శుక్ర వారం రాత్రి మృతి చెందాడు. దీంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు రవి కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో శనివారం ఐ ఇనిస్టిట్యూట్ వైద్య బృందం కళ్లను సేకరించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ధృవీకరణ ప్రతం అందజేశారు. మృతుడికి భార్య అనురాధ కొడుకు, కూతురున్నారు.